AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM



## వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో 'నీట్' పరీక్ష



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని తెలిపింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష ప్రశ్న పత్రాలు లీక్ అయిన విషయం తెలిసిందే. దీంతో ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేసింది. జూన్ 21న రీ ఎగ్జామ్ పెడతామని తెలిపింది. అయితే పేపర్ లీకేజీలు అవుతుండడంతో సీబీటీ విధానంలో పరీక్ష పెట్టాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి శుక్రవారం తెలిపారు. నీట్ పేపర్ లీకేజీ స్పందిస్తూ.. నిందితులను వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

## యూఏఈతో ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యూఏఈతో భారత్ పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 'ఇంధనం, రక్షణ, మౌలిక సదుపాయాలు, నౌకారవాణా, అధునాతన సాంకేతికత వంటి కీలక రంగాలలో ముఖ్యమైన ఒప్పందాలు కుదిరాయి. ఇది భారత్‌యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊపు ఇవ్వనుంది. యూఏఈ భారతదేశంలో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రకటించింది.

## ప్రజలు ముందుకు సాగాలంటే సైకిలే మార్గం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: పెట్రోలు ధరల పెంపుపై సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సెటైరికల్ ట్వీట్ చేశారు. ప్రజలు ముందుకు సాగాలంటే సైకిలే మార్గం అంటూ పోస్ట్ చేశారు. సైకిల్ కన్నా ఉత్తమమైనది ఏదీ లేదని ముందే చెప్పామని పేర్కొన్నారు. కాగా.. యూపీలో ఎస్పీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం.

## ఫిల్మ్ ఛాంబర్‌లో కీలక సమావేశం..




అక్షరటుడే, హైదరాబాద్: ఫిల్మ్ ఛాంబర్‌లో కీలక సమావేశం జరుగుతోంది. ఎగ్జిబిటర్స్, నిర్మాతలతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చర్చలు జరిపింది. సమావేశానికి ఛాంబర్ ప్రెసిడెంట్ సురేష్ బాబు, నిర్మాతలు దిల్ రాజు, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు




అక్షరటుడే, హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి శంషాబాద్ వస్తున్న లుఫ్తాన్సా విమానంలో బాంబు ఉన్నట్లు దుండగులు మెయిల్ చేశారు. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్ట్ సిబ్బంది విమానం ల్యాండ్ కాగానే.. క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.



## బాలుడికి అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి

**అక్షరటుడే, నల్గొండ:** మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గొప్ప మనసు చాటుకున్నారు. కంటి చూపు కోల్పోతున్న ఓ బాలుడికి అండగా నిలిచి మెరుగైన వైద్యం అందేలా చూశారు. దీంతో ఆ బాలుడు ప్రస్తుతం లోకాన్ని చూడగలుగుతున్నాడు. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన శ్రీధర్ నాయక్ అనే వ్యక్తి కుమారుడికి కంటి సమస్యలు ఉన్నాయి. దీంతో ఎల్‌వీ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లారు. వారు ఆపరేషన్‌కు భారీగా ఖర్చవుతాయని చెప్పారు. దీంతో వారు మంత్రి కోమటిరెడ్డిని కలిసి తమ సమస్యను చెప్పుకున్నారు. మంత్రి వెంటనే స్పందించి నిస్సహాయ స్థితిలో ఉన్న పేద కుటుంబానికి సాయం అందించి, చిన్నారికి అవసరమైన వైద్యం చేయించి తిరిగి చూపు వచ్చేలా చర్యలు చేపట్టారు.



## జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆయన చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో నేడు బీజింగ్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# ఇంధన ధరల బాదుడు




- దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లు
- రూ.3 మేర పెంచిన చమురు కంపెనీలు
- కేంద్రం తీరుపై విపక్షాల విమర్శలు
- సామాన్యులపై తీవ్ర ప్రభావం

**దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం రేట్లు పెంచుకోవడానికి ఇంధన సంస్థలకు అనుమతి ఇచ్చింది. దీంతో లీటర్‌కు రూ.3మేర పెంచుతూ ఆయా సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన రేట్లు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమలులోకి వచ్చాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. తాజాగా ఇంధన ధరలు పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. దీని ప్రభావంతో ఇతర వస్తువులు, ఉత్పత్తుల ధరలు సైతం పెరిగే అవకాశం ఉంది.**

**–అక్షరటుడే, నేషనల్ డెస్క్**

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ రేట్లు పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాలు భారతీయుల జేబులపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకడంతో, కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. అమెరికా-ఇరాన్ యుద్ధానికి ముందు బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్లు ఉండగా.. తాజాగా అది 100 డాలర్లు దాటింది. అయితే ముడి చమురు ధరలు పెరిగినా.. ఇన్ని రోజులు చమురు సంస్థలు ధరలు పెంచలేదు. తాజాగా లీటర్‌కు రూ.3 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి.

### హైదరాబాద్‌లో అధికం

దేశవ్యాప్తంగా పెట్రోల్ పెరిగిన తర్వాత.. హైదరాబాద్‌లో ధరలు అధికంగా ఉండటం గమనార్హం. ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే ఇక్కడే రేట్లు ఎక్కువగా ఉన్నాయి. కాగా రవాణా రంగానికి వెన్నెముక లాంటి డీజిల్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. సీఎన్‌జీ వాహనదారులకు కూడా కంపెనీలు షాక్ ఇచ్చాయి. కిలోకు రూ.2 చొప్పున పెంచాయి.

### 2022 తర్వాత..

గత కొన్ని రోజులుగా ఇరాన్ యుద్ధ వాతావరణం నెలకొనడంతో అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతింది. ముడి చమురు సరఫరాలో అంతరాయం కలగడంతో బ్యారెల్ ధర ఒక్కసారిగా భారీగా పెరిగింది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు కంపెనీలు ధరలను సవరించక తప్పలేదు. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న సామాన్యుడికి తాజా పెంపు మరింత భారం కానుంది. రవాణా ఖర్చులు పెరిగితే కూరగాయలు, ఇతర నిత్యావస రాల ధరలు పెరి గే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా 2022 ఏప్రిల్ తర్వాత దేశంలో ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గిం చారు. అయితే ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితుల తో చమురు సంస్థలకు నష్టాలు వస్తుండడంతో రేట్లు పెంచుకోవడానికి కేంద్రం అంగీకరించింది.

**ప్రధాన నగరాల్లో ధరలు ఇలా.. (రూ.లలో)**

| నగరం | పెట్రోల్ | డీజిల్ |
|---|---|---|
| హైదరాబాద్ | 110.50 | 98.70 |
| కోల్‌కతా | 108.74 | 95.13 |
| ముంబయి | 106.68 | 93.14 |
| చెన్నై | 103.67 | 95.25 |
| ఢిల్లీ | 97.77 | 90.67 |

### ఎన్నికలు కాగానే..

దేశంలో ఇటీవల నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు అయిపోయాయి. ఎన్నికల నేపథ్యంలో ఇన్ని రోజులు కేంద్రం ఇంధన ధరలు సవరించకుండా ఉందని విపక్షాలు విమర్శిస్తున్నారు. ఎన్నికలు అయిపోగానే ప్రజలపై భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికలు కాగానే గ్యాస్ ధరలను కేంద్రం పెంచింది. తాజాగా పెట్రోల్, డీజిల్ రేట్లను సవరించింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో టిమ్స్ ఏర్పాటు చేశాం : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** దేశంలోనే అత్యధిక వైద్య సిబ్బందితో కూడిన ప్రభుత్వ వైద్య వ్యవస్థగా టిమ్స్‌ను అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సనత్‌నగర్ టిమ్స్‌ను శుక్రవారం సందర్శించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. జూన్‌లో ఈ ఆస్పత్రిని ప్రారంభిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం అందులో ట్రయల్ రన్ కొనసాగుతోంది. తాజాగా కేటీఆర్ ఆస్పత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. బసవతారకం ఆస్పత్రి బయట రోడ్డు మీద రోగుల అటెండెంట్స్ పడుకోవడం చూసి.. టిమ్స్ ఆసుపత్రి కట్టే సమయంలోనే అలాంటి వారి కోసం 200 పడకలతో ధర్మశాలను కేసీఆర్ కట్టించారని చెప్పారు.

## కుల్దీప్ సింగ్ సెంగార్ శిక్షపై సుప్రీం కీలక తీర్పు




**అక్షరటుడే, ఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచార కేసులో దోషిగా తేలిన మాజీ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు శుక్రవారం రద్దు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కేసును తిరిగి విచారించాలని హైకోర్టును ఆదేశించింది. సెంగార్ దాఖలు చేసిన అప్పీలును రెండు నెలల్లోపు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని కోరుతూ, ఒకవేళ వేసవి సెలవుల లోపు తుది నిర్ణయం తీసుకోలేకపోతే అప్పుడు మాత్రమే శిక్ష నిలిపివేత అంశాన్ని పరిశీలించాలని ధర్మాసనం పేర్కొంది.

## జిన్‌పింగ్ గొప్ప స్నేహితుడు : ట్రంప్

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనలో భాగంగా రెండో ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ షీ జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యారు. ట్రంప్‌కు చైనాలో ఘన స్వాగతం లభించింది. ఇటీవలి చరిత్రలో 47వ అధ్యక్షుడికి లభించినంత గౌరవం మరే ఇతర అధ్యక్షుడికీ లభించలేదు. చైనా నాయకుడు షీ జిన్‌పింగ్, బీజింగ్‌లోని కమ్యూనిస్ట్ పార్టీ రహస్య నాయకత్వ ప్రాంగణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చివరి సమావేశాల కోసం ఆతిథ్యం ఇస్తున్నారు. శిఖరాగ్ర సమావేశంలో జిన్‌పింగ్ అమెరికా చైనా సంబంధాన్ని ప్రపంచంలోనే అత్యంత కీలకమైనదిగా అభివర్ణించారు. ట్రంప్‌తో మాట్లాడుతూ, "మనం దీనిని విజయవంతం చేయాలి, ఎప్పటికీ చెడగొట్టకూడదు" అని అన్నారు.



## హైదరాబాద్‌లో కారు బీభత్సం




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో ఓ ల్యాండ్ రోవర్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి బోల్తా పడింది. హైటెక్‌సిటీలోని మెడికవర్ హాస్పిటల్ సమీపంలో ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. అతివేగంగా వస్తున్న ఒక విలాసవంతమైన ల్యాండ్‌రోవర్ డిఫెండర్ కారు అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆ తర్వాత పల్టీలు కొడుతూ వెళ్లింది. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడని స్థానికులు ఆరోపించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న కొందరు యువకులు ఎలాంటి గాయాలు లేకుండా తప్పించుకున్నారని, వారు అక్కడి నుంచి పారిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ ఘటనతో అక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ విలీనంపై కసరత్తు..



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇవాళ మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, యూనియన్ ఎన్నికలు, కార్మికుల ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గత నెలలో తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మే 1న సీఎం రేవంత్ రెడ్డితో యూనియన్ నేతలు సమావేశమయ్యారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి ఒక కీలక ప్రతిపాదనను నేతల ముందుంచారు. "మీకు కార్మిక సంఘాల ఎన్నికలు కావాలా? లేక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలా?" అని ఆప్షన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఆఫర్‌పై యూనియన్ నాయకులు ఏకగ్రీవంగా స్పందించారు. కార్మిక సంఘాల ఎన్నికల కంటే ప్రభుత్వంలో విలీనం కావడమే తమకు ప్రాధాన్యమని, ఆ డిమాండ్‌కే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

## పెద్ది ప్రమోషన్స్‌కు దూరంగా జాన్వీ..!



రామ్ చరణ్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది' మూవీపై సినీ వర్గాల్లో భారీ అంచనాలున్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి హైప్ ఉంది. అయితే మూవీ ప్రమోషన్స్‌కు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న జాన్వీ కపూర్ ప్రమోషనల్ కార్యక్రమాలకు దూరంగా ఉండబోతున్నారనే ప్రచారం ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. సినిమాలో ఆమె పాత్రకు పరిమిత ప్రాధాన్యం మాత్రమే ఉందని, అందుకే ప్రమోషన్స్‌లో పెద్దగా కనిపించకపోవచ్చనే టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక క్లారిటీ రాలేదు.

–అక్షరటుడే, సినిమాడెస్క్